క్లుప్తంగా

వైద్యారోగ్య శాఖలో డిప్యుటేషన్లు రద్దు

నిజామాబాద్‌నాగారం: జిల్లా వైద్యారోగ్య శాఖలో డిప్యుటేషన్లు రద్దు చేశారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, డీఎంహెచ్‌వోకు ఆదేశాలు జారీ చేశారు. నిజామాబాద్ జిల్లాలో ఏళ్ల తరబడిగా చాలా మంది ఉద్యోగులు విధులకు రాకున్న డుమ్మాలు కొడుతూ కాలం వెల్లదీస్తున్నారు. మరికొంత మంది ఉద్యోగులు ప్రతి నెల మామూళ్లు ఇచ్చి డిప్యుటేషన్లలో కొనసాగుతున్నారు. దీనిపై సాక్షిలో కథనాలు వెలువడటంతో కార్యదర్శి క్రిస్టినా డిప్యుటేషన్లను రద్దు చేయాలని ఆదేశాలు జారీచేశారు. గురువారం పూర్తి స్థాయిలో రద్దు కానున్నాయి. 40 నుంచి 80 మంది వరకు డిప్యుటేషన్లలో కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

పసుపు పంట తూకం పరిశీలన

బాల్కొండ: వన్నెల్(బి) గ్రామంలో పసుపు పంట తూకాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించారు. ప్రస్తుత సంవత్సరం పంట దిగుబడి అంచనాపై ప్రయోగాత్మకంగా పంటను అంచనా వేసినట్లు తెలిపారు. పసుపు కొమ్మును తవ్వి పంటను పరిశీలించారు. జిల్లా గణాంక అధికారి రతన్, అధికారులు కవిత, అన్నపూర్ణ, గంగామోహన్ పాల్గొన్నారు.

బీసీలు దేశానికి వెన్నుముక

బోధన్‌టౌన్(బోధన్): ఎక్కువ శాతం జనాభా కలిగిన బీసీలు దేశానికి, రాష్ట్రానికి వెన్నుముక అని బీసీ ఐక్య కులాల వేదిక రాష్ట్ర కార్యదర్శి శివకుమార్ అన్నారు. బోధన్‌లో మంగళవారం బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన శివకుమార్‌ను జిల్లా జంగమ సమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడారు. బీసీల కులగణనకు కేబినెట్ ఆమోదం తెలపడం అభినందనీయం అన్నారు. నేతలు సిద్ధ లింగప్ప, అజయ్‌కుమార్ అప్ప, నర్సింగ్ అప్ప, శంకర్ అప్ప, సూర్యకాంత్ అప్ప పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఆర్మూర్‌టౌన్: విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పాఠశాల ప్రిన్సిపాల్ అక్బరీ బేగం అన్నారు. ఆర్మూర్ పట్టణ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం కళాశాల వార్షికోత్సవంలో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థినిలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. పీడీ గంగాధర్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

నవీపేట: ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై యాదగిరి గౌడ్ సూచించారు. నారాయణ్‌పూర్‌లో బుధవారం జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొబైల్ ఫోన్‌ను వాడే వారు తమ ఓటీపీని ఇతరులకు షేర్ చేయొద్దని సూచించారు. మోసానికి గురైన బాధితులు వెంటనే పోలీసులను సంప్రదిస్తే న్యాయం చేస్తామన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

బోధన్‌టౌన్(బోధన్): మండల విద్యాధికారి కార్యాలయాన్ని బుధవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ముట్టడించి అనంతరం ధర్నా నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పాఠశాలల పర్మిషన్‌ను రద్దు చేయాలని, జీవో నెం–1 ప్రకారం పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఏఐఎస్‌ఎఫ్ డివిజన్ ఇన్‌చార్జి అంజలి డిమాండ్ చేశారు. అనంతరం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఎదుట ధర్నా చేశారు.

సమ్మెను విజయవంతం చేయాలి

బోధన్‌టౌన్(బోధన్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఇఫ్టు జిల్లా కోశాధికారి దాల్‌మల్కా పోశెట్టి పిలుపునిచ్చారు. బుధవారం బోధన్‌లో ఇఫ్టు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మున్సిపల్ కార్మికులున్నారు.

ఆల్ ఇన్ వన్ పేపర్ల పంపిణీ

భీమ్‌గల్: ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, జిల్లా ఇన్‌చార్జి శాసన సభ్యుడు అహ్మద్ బిలాల్ ఆదేశాల మేరకు ఎంఐఎం మండల అధ్యక్షుడు ఆసిఫ్ ఆధ్వర్యంలో భీమ్‌గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉర్దూ మీడియం చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ మోడల్ పేపర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం రాజేందర్ , తదితరులు పాల్గొన్నారు.

రమాబాయికి నివాళులు

బాల్కొండ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి జయంతిని బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రమాబాయి, అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు. ప్రిన్సిపాల్ చిన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్లపైనే వ్యాపారం



రోడ్డును ఆక్రమించి వస్తువులను ఉంచిన దృశ్యం



రోడ్లపై తోపుడు బండ్ల వ్యాపారం

- నిత్యం ట్రాఫిక్ సమస్యలు
- పట్టించుకోని అధికారులు

ఆర్మూర్: పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పాతబస్టాండ్, టెక్‌మజీద్ వెళ్లేదారి, భారత్‌గ్యాస్, కొత్తబస్టాండ్ వెళ్లేదారిలో ప్రయాణించాలంటే పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య వల్ల వాహనాలు ఎక్కడిక్కడే నిలిచిపోతున్నాయి. ఆ దారుల్లో ఉన్న దుకాణదారులకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో వచ్చే కొనుగోలుదారులు రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారు. దీంతో సమస్య తీవ్రమవుతుంది. దీనికి తోడు తోపుడు బండ్లతోనే రోడ్లపై వ్యాపారాలు చేస్తున్నారు. రోడ్లను ఆక్రమించి దుకాణాలు వెలుస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా పోలీసులు, మున్సిపల్ అధికారులు దృష్టిసారించి కాలనీల్లో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని, రోడ్లపై వ్యాపారులు వస్తువులు ఉంచకుండా చూడాలని కోరుతున్నారు.

జరిమానా విధిస్తాం



రోడ్డును ఆక్రమించి దుకాణదారులు వస్తువులు ఉంచితే వారికి జరిమానా విధిస్తాం. అలాగే రోడ్లపై వ్యాపారం చేస్తున్న వారిపై సైతం చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా చూస్తాం.
– ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

వరిలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలి



పంటను పరిశీలిస్తున్న అధికారులు

బాల్కొండ: వరి పంటలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం బోదేపల్లిలో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వరి నాట్లు వేసిన 15– 20 రోజుల మధ్యలో మొగిపురుగు, కాండం తొలుచు పురుగు నివారణకు కార్టప్ హైడ్రో క్లోరైడ్ ఫ్లస్ ఇమామెక్టిమ్ బెంజాయిట్ మూడు కిలోలు లేదా క్లోరాంత్రనిపోలు గుళికలు నాలుగుల కిలోలు చల్లుకోవాలన్నారు. వరి నాటిన 40 నుంచి 60 రోజుల మధ్యలో మొగి పురుగు నివారణకు కార్టప్ హైడ్రో క్లోరైడ్ 400 గ్రాములు లేదా క్లోరాతంత్రిప్రోలు 60 ఎంఎల్ ఏదైనా ఒక దానిని 200 లీటర్ల నీటిలో పిచికారి చేసుకోవాలన్నారు. యాసంగిలో వరిలో అగ్గి తెగులు అధికంగా వస్తుందని,యూరియ అధికంగా వినియోగించొద్దన్నారు. వైస్ ఎంపీపీ శ్రీకాంత్, ఏఈవో నిహారిక పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యం కోసమే అల్బెండజోల్ మాత్రలు



మాట్లాడుతున్న మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్

రుద్రూర్: పిల్లలు ఆరోగ్యంగా ఉండటానికి నులి పురుగు నివారణ మాత్రలు(అల్బెండజోల్ మాత్రలు) వేయించాలని కోటగిరి ఉమ్మడి మండల ఆరోగ్య విస్తరణ అధికారి(హెచ్‌ఈవో) గోవర్ధన్ అన్నారు. కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడి టీచర్‌లకు బుధవారం నేషనల్ డీవార్మింగ్ డే కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఈవో గోవర్ధన్ మాట్లాడుతూ... ఈ నెల 12న పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్బెండజోల్ మాత్రలను అందజేయాలని సూచించారు. ఎంపీవో మారుతి, హెల్త్ సూపర్‌వైజర్‌లు జ్యోతి, సాయికుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు మణి, అనురాధ పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలి



మాక్లూర్‌లో చెత్తను సేకరిస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, పక్కన డీపీవో జయసుధ



మోస్రాలో పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో చందర్ నాయక్

మాక్లూర్: గ్రామాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే జబ్బులకు దూరమవుతామని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో పారిశుధ్య కార్యక్రమాన్ని జెడ్పీ చైర్మన్ ప్రారంభించి మాట్లాడారు. పారిశుధ్య వ్యవస్థ సక్రమంగా లేకపోతే దోమలు పెరిగి పోతాయన్నారు. గ్రామాల్లోని వాడలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులకు దూరం అవుతామన్నారు. అందరు సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పంచాయతీ అధికారి జయసుధ, ఎంపీడీవో, మాక్లూర్ స్పెషల్ ఆఫీసర్ జె.క్రాంతి, ఎంపీవో టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

వర్ని: గ్రామాల్లో మురికి కాలువలు, రోడ్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని వర్ని ఎంపీడీవో బషీరుద్దీన్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సత్యనారాయణపురంలో బుధవారం పారిశుధ్య పనులను ఎంపీడీవో పరిశీలించారు. అనంతరం ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి సాయిలు పాల్గొన్నారు.

బాగేపల్లిలో..

రెంజల్(బోధన్): మండలంలో ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు గ్రామాల్లో తిరుగుతూ రోడ్లు, డ్రైనేజీలు పరిశీలించారు. రోజూ వారి కార్యక్రమాల్లో భాగంగా గ్రామాలను శుభ్ర చేయిస్తామని ఎంపీడీవో శంకర్ తెలిపారు.

పారిశుధ్యం విషయంలో అజాగ్రత్త వద్దు

వర్ని(మోస్రా): పారిశుధ్యం విషయంలో మండల, గ్రామ స్థాయి అధికారులు అజాగ్రత్తగా ఉండొద్దని డీఆర్‌డీవో చందర్ నాయక్ సూచించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు గోవూరు గ్రామంలో పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. మండల ప్రత్యేక అధికారి సాయిలు, ఏపీవో సురేష్, రఘు పాల్గొన్నారు.

కోటగిరి, పొతంగల్, రుద్రూర్ పరిధిలో..

రుద్రూర్: కోటగిరి, పొతంగల్, రుద్రూర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో బుధవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. రహదారులను శుభ్రం చేశారు. ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు తొలగించి రోడ్లపైన ఏర్పడ్డ గుంతలను పూడ్చి వేశారు. గ్రామ ప్రత్యేకాధికారులు ఈ పనులను పర్యవేక్షించారు.

తీరు మార్చుకోని అధికారులు



వర్ని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు



గైర్హాజరై కూడా సంతకాలు చేసిన దృశ్యం

వర్ని: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పనిచేసే అధికారులు తీరు మార్చుకోలేదు. ఈ నెల 2న సమయపాలన పాటించని అధికారులు అనే శీర్షికతో సాక్షిలో వార్త ప్రచురితమైన తర్వాత రెండు రోజుల పాటు అధికారులు సమయానికి కార్యాలయానికి హాజరయ్యారు. ఆ తర్వాత యధావిధిగానే సమయపాలన పాటించకుండా 11.30 గంటలు దాటిన తర్వాతనే కార్యాలయానికి విధులకు హాజరవుతున్నారు. బుధవారం అధికారుల తీరు ఇందుకు నిదర్శనం. 10.30 గంటలకు విధులకు హాజరు కావలసిన అధికారులు 11:30 తర్వాత కూడా కార్యాలయానికి రాలేదు. కార్యాలయానికి వచ్చిన ప్రజలు అధికారుల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ విషయమై వర్ని ఎంపీడీవో బషీరుద్దీన్‌ను వివరణ కోరగా మౌనం వహించారు.

ఇబ్బందులుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలి

బోధన్‌రూరల్(బోధన్): గ్రామాల్లో పాలన వ్యవహారంలో ప్రత్యేక అధికారులకు ఇబ్బందులు, వివాదాస్పద అంశాలు ఉంటే పోలీస్ శాఖ దృష్టికి తీసుకురావాలని బోధన్ రూరల్ సీఐ నరేశ్, తహసీల్దార్ గంగాధర్‌లు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రత్యేక అధికారులకు మండల అధికారులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో పర్బన్న పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



ఆర్మూర్‌టౌన్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆర్మూర్ డివిజన్ నేత సిద్దాల నాగరాజు డిమాండ్ చేశారు. ఆర్మూర్ ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమస్యలతో గురుకుల, కేజీబీవీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నాలుగేళ్ల నుంచి సుమారు రూ.7,792 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయలేదని తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జవహర్ సింగ్, అభిషేక్, సంధ్య, అక్షిత పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఎడపల్లి(బోధన్): జానకంపేట్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఈ నెల 17న ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు బుధవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని దేవాదాయ శాఖాధికారులు ఆహ్వానించారు. ఎమ్మెల్యే నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేసి ఘనంగా సన్మానించి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఆలయ ఈవో గింజుపల్లి వేణు, కార్యదర్శి రఘు, ఆలయ అర్చకులున్నారు.

'విప్లవమే మా పార్టీ లక్ష్యం'

కమ్మర్‌పల్లి: దేశంలో ప్రజాతంత్ర, సోషలిస్టు విప్లవమే సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర సెక్రటేరియేట్ సభ్యుడు వి. ప్రభాకర్ అన్నారు. కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌లో ఆయన మాట్లాడారు. పిడివాదంతో కాకుండా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కమ్యూనిస్ట్ విప్లవకారులు తమ పంథా కార్యక్రమాలను మార్చుకోవలసిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పీసీసీ సీపీఐ ఎంఎల్, సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా, సీపీఐ ఎంఎల్ ఇన్సియేటివ్ రివల్యూషనరీ పార్టీలు విప్లవోద్యమమే ఎజెండాగా ఐక్యం అవుతున్నాయని, ఇందులో భాగంగానే మార్చి 3, 4, 5 తేదీలలో నిర్వహించే భారీ ర్యాలీ, బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు సారా సురేష్, జి.కిషన్, సత్తెక్క పాల్గొన్నారు.

■ **నేడు బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం**

ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ ఆర్మూర్ మండల అధ్యక్షుడు ఆలూర్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం తెలిపారు. పెర్కిట్ ఎమ్మార్ గార్డెన్స్‌లో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు.

■ **నేడు ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరం**

ఆర్మూర్‌టౌన్: భీమ్‌గల్ మండల కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో ఉచిత ఈఎన్‌టీ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు విద్యా గోపికృష్ణ తెలిపారు. ఈఎన్‌టీ సూపర్ స్పెషలిటీ ఆస్పత్రి(హైదారబాద్) వారి సహకారంతో ఈ క్యాంపు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు ఉంటుందని తెలిపారు.

విద్యార్థులకు అవగాహన సమావేశం

మోర్తాడ్: మోర్తాడ్‌లోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు వివిధ అంశాలపై ఎస్సై అనిల్ రెడ్డి అవగాహన సమావేశం నిర్వహించారు. బుధవారం కస్తూర్బా విద్యార్థులకు మొబైల్ సేఫ్టీ, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, కొరియర్ స్కామ్, ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్, ఇతర సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి స్వప్న, టీచర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గౌరవప్రదంగా హాజరయ్యారు

- ఆర్మూర్ మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి



ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీతపై నిర్వహించిన అవిశ్వాస తీర్మాన సమావేశంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని హాజరు కావాలని ఎలాంటి నోటీసు ఇవ్వకున్నా గౌరవప్రదంగా హాజరయ్యారని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ జీవీ నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్ పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడారు. 2019 మున్సిపల్ యాక్ట్ ప్రకారం 30 రోజుల్లో ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు తన నియోజకవర్గం పరిధిలోని ఎలాంటి మున్సిపల్ సమావేశానికైనా హాజరు కావచ్చని, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా కాకుండా ఎమ్మెల్యే హోదాలోనే హాజరయ్యారన్నారు. అవిశ్వాస తీర్మాన సమావేశం నోటీసులను 15 రోజుల క్రితం 36 మంది కౌన్సిలర్లకు ఇవ్వగా అందులో 24 మంది కౌన్సిలర్ల మద్దతుతో అవిశ్వాస తీర్మానం నెగ్గిందన్నారు. కానీ అధికారులు స్పష్టత లేకుండా ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికను తారుమారు చేస్తున్నారని ఆరోపించారు. ఎక్స్ అఫిషియో ఓటు హక్కు విషయంలో ఆర్డీవో, ఉన్నతాధికారులను అవిశ్వాస తీర్మానం అనంతరం క్లారిఫికేషన్ తీసుకోవడాన్ని తప్పుబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఆర్మూర్ మున్సిపాలిటీలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. బీజేపీ నాయకులు కలిగోట గంగాధర్ పాల్గొన్నారు.

ప్రజా పంథా నేతల అరెస్ట్ సరికాదు



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

బోధన్‌టౌన్(బోధన్): ఖమ్మం ప్రజాపంథా పార్టీ నాయకులపై పోలీసులు అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడం సరికాదని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.మల్లేష్ అన్నారు. నాయకులపై పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 5న ఖమ్మంలో జరిగిన చిన్న పాటి గొడవను సాకుగా చూపి పోలీసులు ప్రజా ఉద్యమకారులపై కేసులు బనాయించి జైలుకు పంపడం సరైన పద్ధతి కాదన్నారు. అరెస్టు చేసిన నాయకులను తక్షణమే విడుదల చేసి, కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పడాల శంకర్, సుల్తాన్ సాయిలు, సీహెచ్.గంగయ్య, బాలయ్య, రాజు, శ్రీను, ఖాజ, పీవోడబ్ల్యూ పట్టణ అధ్యక్షురాలు గంగామణి తదితరులు ఉన్నారు.

గృహజ్యోతి పథకం అర్హుల వివరాల సేకరణ



వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో గృహజ్యోతి పథకానికి అర్హులైన వినియోగదారుల వివరాలను విద్యుత్ శాఖ అధికారులు బుధవారం సేకరించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ శ్రావణ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారి వివరాలను సేకరించి వారి ఆహార భద్రతా కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్లు, విద్యుత్ బిల్లులను అప్‌లోడ్ చేశారు. ఆలూర్ మండల కేంద్రంలో 8,100 వినియోగదారులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా ఏఈ శ్రావణ్ మాట్లాడుతూ.. అద్దె ఇంట్లో ఉన్న వారు సైతం పథకానికి అర్హులని తెలిపారు. లైన్‌మెన్లు శివ, అజయ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నాళేశ్వర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు



పథకాల గురించి వివరిస్తున్న బీజేపీ నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధిష్టానం పిలుపు మేరకు పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా నాయకులు బుధవారం మగ్గిడి గ్రామాన్ని సందర్శించారు. నాయకులు గొల్ల బాబు రావు, రాజేంద్ర, రంజిత్ కుమార్, మహేందర్, టింకు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నాళేశ్వర్‌లో..

నవీపేట: నాళేశ్వర్ గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం పల్లెకు పోదాం చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎంపీ ఎన్నికలలో బీజేపీని గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రభారి మైసరాధ, తాజా మాజీ సర్పంచ్ సరిన్, బీజేపీ నాయకులు గణేష్, రాజు శ్రీనివాస్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు చేరువలో కేంద్ర ప్రభుత్వ పథకాలు

మాక్లూర్: కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ గావ్ చలో అభియాన్ ప్రవాసి మండల కన్వీనర్ దేదావత్ రమేష్‌నాయక్ సూచించారు. బుధవారం వేణుకిసాన్‌నగర్‌తండా, చర్ల తండాలలో ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. చిన్నచితకా వ్యాపారాల కోసం మహిళ సంఘాల్లో ముద్ర రుణాలు ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమేనని చెప్పారు. మండల బీజేపీ నాయకులు మారుతి, సురేష్, నితిన్, శోభన్, విజయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న చరిత్ర కాంగ్రెస్‌ది



వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మంజూరు చేయించిన అభివృద్ధి పనులను అడ్డుకుంటున్న చరిత్ర కాంగ్రెస్ వారిదేనని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. వేల్పూర్ గ్రామశాఖ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బబ్బూరు ప్రతాప్‌రెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షుడు పిట్ల సత్యం, తదితరులు బుధవారం వేల్పూర్‌లో మాట్లాడారు. యాభై సంవత్సరాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రైతులకు ఏమి చేసిందో చెప్పాలన్నారు. అబద్ధాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	హ్యాపీ ఎండింగ్ – 12.05, 6.20 బూట్‌కట్ బాలరాజు (తెలుగు) – 3.15 ధీర (తెలుగు) – 9.30
స్క్రీన్-2 –	హనుమాన్ (తెలుగు) – 02.40, 6.00, 9.20
స్క్రీన్-3 –	అంబాజీపేట మ్యారేజీ బ్యాండు– 10.35, 1.30, 4.25, 7.20, 10.15
స్క్రీన్-4 –	ధీర (తెలుగు) – 01.20 కిస్మత్ (తెలుగు) – 4.00, 9.50 గేమ్ ఆన్ (తెలుగు) – 6.50